

## గోశాలకు రాజన్న కోడెలు

వేములవాడఅర్బన్: రాజన్న 20 కోడెలను జనగామ జిల్లా కొండాపూర్ దళిత మహిళల గోరక్ష సమితికి అందజేశారు.




## సీపీఆర్‌పై శిక్షణ

సిరిసిల్లటౌన్: జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో సోమవారం సిరిసిల్ల ఆర్టీసీ డిపో సిబ్బందికి సీపీఆర్ ప్రక్రియపై శిక్షణ ఇచ్చారు.

గరిష్టం/కనిష్టం
41.0/32.0

## వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి వేళ చలిగాలులు వీస్తాయి.




## న్యూస్‌రీల్

### కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఆర్‌డీవో

ముస్తాబాద్(సిరిసిల్ల): ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని డీఆర్‌డీవో గౌతంరెడ్డి పేర్కొన్నారు. గూడెంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించి మాట్లాడారు. దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దని కోరారు. ఏ గ్రేడు రకానికి రూ.2,060, బీ గ్రేడు రకానికి రూ.2,040 ధర చెల్లిస్తున్నట్లు తెలిపారు. ధాన్యం విక్రయించిన వారానికే బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమవుతాయన్నారు. ఎంపీపీ శరత్‌రావు, జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, సర్పంచ్ సరిత, ఉపసర్పంచ్ శాడ శ్రీనివాస్, ఎంపీటీసీ బొప్ప శ్రీధర్, ఏపీఎం జయసుధ, సురేందర్‌రావు, బాలయ్య, శ్రీనివాస్‌రావు, సావిత్రి పాల్గొన్నారు.

### నేతకార్మికులకు పని కల్పించాలి



మాట్లాడుతున్న మూశం రమేశ్

సిరిసిల్లటౌన్: వస్త్ర పరిశ్రమలోని ఆసాముల సమ్మెతో ఖాళీగా ఉంటున్న నేతకార్మికులకు వెంటనే పని కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని పవర్‌లూమ్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్ కోరారు. ఈమేరకు సోమవారం బీవైనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. ఆసాముల డిమాండ్ల అమలులో అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవచూపాలని కోరారు. గుండు రమేశ్, సబ్బని చంద్రకాంత్, బిజిగం సురేశ్, కంది మల్లేశం, ఆంజనేయులు, రాజశేఖర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

### నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి



అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు వినతి పత్రం అందిస్తున్న ఐక్యవేదిక నాయకులు

వేములవాడఅర్బన్: మిడ్‌మానేరు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేములవాడ నందికమాన్ వద్ద మిడ్‌మానేరు ముంపు గ్రామాల ఐక్యవేదిక, అఖిలపక్షం ఆధ్వర్యంలో సమావేశమై.. పలు అంశాలు తీర్మానించినట్లు తెలిపారు. ఈనెల 30 వరకు ప్రభుత్వం నిర్వాసితులకు ఇచ్చిన హామీలైన రూ.5.04 లక్షలు అందించాలని, పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. వీటిని నెరవేర్చకపోతే మే 3వ తేదీన వేములవాడ నందికమాన్ వద్ద మిడ్ మానేరు ముంపు గ్రామాల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఐక్యవేదిక అధ్యక్షుడు కూస రవీందర్, బీజేపీ రాష్ట్ర నాయకులు ఎర్రం మహేశ్, పిల్లి కనకయ్య, చింతపల్లి వెంకటేశ్వరరావు, ఎర్రం రాజు, కదిరె రాజుకుమార్, బాస రాజశేఖర్, బుర్ర శేఖర్‌గౌడ్, గాలిపెల్లి స్వామి, పండుగ పర్శరాములు, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

### నీలగిరి చెట్లకు మంటలు..

వీర్నపల్లి(సిరిసిల్ల): వీర్నపల్లి మండల కేంద్రంలోని అటవీ శాఖ కార్యాలయం ఎదురుగా ఉన్న నీలగిరి చెట్లలో సోమవారం మంటలు చెలరేగాయి. ప్రయాణికులు గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన ఎఫ్ఎస్‌వో రంజిత్‌కుమార్ సిబ్బందితో కలిసి మంటలు ఆర్పివేశారు. ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

# అలకటి పనులు.. 67 ఏళ్లలో ఎందుకు చేయలేదు?



తిమ్మాపూర్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనం ప్రారంభించిన మంత్రి కేటీఆర్

- ప్రశ్నించిన మంత్రి కేటీఆర్
- అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు..
- గిరిజనుల దశాబ్దాల ఆకాంక్షను నెరవేర్చిన ఘనత కేసీఆర్‌ది
- 3,416 తండాలు గ్రామపంచాయతీలుగా ఏర్పాటు
- నూతన జీపీ భవనాలు ప్రారంభం
- సిరిసిల్లలో రెండు ఎకరాల్లో గిరిజన భవనం



రాజన్నపేటలో కుట్టుశిక్షణ కేంద్రంలో మంత్రి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాష్ట్రంలో తొమ్మిదేళ్లలో చేసిన అభివృద్ధి పనులు అలకటివిగా చెబుతున్న ప్రతిపక్షాలు 67 ఏళ్లలో ఎందుకు చేయలేదని మున్సిపల్, ఐటీశాఖ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. 'మావ నాటే..మావ రాజ్', 'మాతండాలో మా రాజ్యం' అనే ఆదివాసీ గిరిజనుల దశాబ్దాల ఆకాంక్షను నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 3,416 తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేశామన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం దుమాల, రాజన్నపేట, బాకూరుపల్లితండా, రాచర్లతిమ్మాపూర్ గ్రామాలలో మంత్రి కేటీఆర్ సోమవారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో పంచాయతీ భవనాలు, ప్రాథమిక సహకార సంఘ భవనాన్ని ప్రారంభించారు. మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లా ప్రజలు తనను గుండెల్లో పెట్టి చూసుకున్నారన్నారు. అభివృద్ధిపై బీజేపీ, కాంగ్రెస్ నాయకులు సొల్లు కబుర్లు చెబుతున్నారని విమర్శించారు. గిరిజనుల సౌలభ్యం కోసం సిరిసిల్ల పట్టణంలో రెండెకరాల స్థలంలో మంత్రి సత్యవతిరాథోడ్ చేతుల మీదుగా గిరిజన భవనానికి శంకుస్థాపన చేస్తామన్నారు. త్వరలోనే అర్హులైన గిరిజనులు సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. పోడు, లావుని పట్టాభూముల సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 6 శాతం ఉన్న రిజర్వేషన్‌ను పది శాతానికి పెంచామన్నారు. గృహలక్ష్మి పథకం కింద ఇళ్లను మంజూరు చేస్తామని తెలిపారు. ఇప్పటి వరకు లక్ష మంది రైతు కుటుంబాలకు రూ.5వేల కోట్లకు పైగా బీమా పరిహారం అందించినట్లు తెలిపారు. ఎవరూ అడగకుండానే బీడీ కార్మికులకు పింఛన్లు ఇస్తున్నామన్నారు.

**దత్తత గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి**

మంత్రిగా రాజన్నపేటను 2014లో దత్తత తీసుకొని ఇప్పటి వరకు రూ.20.38కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. కుట్టుశిక్షణ తీసుకున్న మహిళలకు 90 మిషన్లను నెల రోజుల్లో అందిస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలో మిగిలి ఉన్న డ్రెయినేజీలు, ఇతర పనులు పూర్తి చేస్తామన్నారు. బాకూరుపల్లిలో మురుగునీటి పనులు చేపట్టాలని కలెక్టర్‌ను ఆదేశించారు. బోరు నీళ్లు కాకుండా మిషన్ భగీరథ నీళ్లు తాగుతూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఆర్డీవో శ్రీనివాస్‌రావు, డీఐజీ రమేశ్‌నాయుడు, ఎస్పీ అఖిల్‌మహాజన్, ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, తహసీల్దార్ జయంత్‌కుమార్, ఎంపీడీవో చిరంజీవి, సర్పంచులు ముక్క శంకర్, అజ్మీరా మంజుల, పడిగెల రవీందర్, సింగిల్‌విండో చైర్మన్‌లు కృష్ణారెడ్డి, సుధీర్‌రావు, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

**మంత్రి పర్యటన సాగిందిలా..**

ఎల్లారెడ్డిపేట మండలంలోని కల్లోల పల్లెల్లో సోమవారం మంత్రి కేటీఆర్ సుడిగాలి పర్యటన చేశారు. మొదట దుమాలలో శ్రీమల్లికార్జున స్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. కిష్టునాయక్‌తండాలోని జగదాంబ ఆలయంలో మొక్కులు చెల్లించుకున్నారు. అక్కడి గిరిజన మహిళలు విన్నపం మేరకు.. నెల రోజుల్లో మహిళా సంఘ భవనం మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. రాజన్నపేట ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతి గదులకు శంకుస్థాపన చేశారు. అదే గ్రామంలో పంచాయతీ భవనం, బాకూరుపల్లిలో జీపీ భవనం, రాచర్లతిమ్మాపూర్‌లో ప్రాథమిక సహకార సంఘం కార్యాలయ నూతన భవనాలను మంత్రి ప్రారంభించారు. ఇటీవల ప్రమాదానికి గురై కాలుకు శస్త్ర చికిత్స చేయించుకున్న పార్టీ సీనియర్ నాయకుడు అందె సుభాష్‌ను పరామర్శించారు.

## బాధిత కుటుంబానికి భరోసా

- బస్తీ దవాఖానాలో ఉద్యోగ నియామకం
- మాట నిలబెట్టుకున్న మంత్రి, కలెక్టర్‌లు
- కుటుంబంలో వెలుగు నింపిన 'సాక్షి'



కట్ట లతకు ఉద్యోగ నియామకపత్రం అందిస్తున్న జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు

వేములవాడరూరల్: కుటుంబ పెద్ద మృతితో రోడ్డున పడ్డ కుటుంబానికి ప్రభుత్వం భరోసా కల్పించింది. ఇచ్చిన హామీని మంత్రి కేటీఆర్, కలెక్టర్ అనురాగ్ జయంతి నిలబెట్టుకున్నారు. మృతుడి భార్యకు ఉద్యోగం కల్పించి వారి కుటుంబానికి అండగా నిలిచారు. వేములవాడ మండలం వట్టెంల గ్రామానికి చెందిన కట్ట మల్లేశం సైకిల్ రిపేర్ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో మరణించాడు. మల్లేశంకు ఇద్దరు ఆడపిల్లలు మోక్షిత, లావణ్య. ఈ విషయాన్ని 2022 అక్టోబర్ 12న 'చదుకుంటాం సహాయం చేయండి' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన మంత్రి కేటీఆర్ వెంటనే ఆ కుటుంబానికి తగిన న్యాయం చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతిని ఆదేశించారు. మరుసటి రోజు కలెక్టర్ వట్టెంల గ్రామంలో మల్లేశం భార్య కట్ట లత, ఇద్దరు పిల్లలను కలిసి మనోధైర్యం కల్పించి, ఆర్థిక సహాయం చేశారు. ప్రభుత్వపరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. సోమవారం జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు వేములవాడలో కొనసాగుతున్న బస్తీ దవాఖానాలో ఉద్యోగ నియామకపత్రాన్ని ఆమెకు అందజేశారు. కట్ట లత మాట్లాడుతూ మా కుటుంబ పరిస్థితులను అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఉపాధిమార్గం చూపించిన 'సాక్షి' దినపత్రికకు రుణపడి ఉంటానన్నారు. తనను ఆదుకున్న మంత్రి కేటీఆర్, కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా వైద్యాధికారులకు, సర్పంచ్ యామ సుమతిలకు కృతజ్ఞతలు తెలిపారు.

## న్యాయం చేయండి..

- విద్యుత్‌స్తంభం ఎక్కిన యువకుడు
- విద్యుత్ సరఫరా నిలిపివేసిన పోలీసులు

ముస్తాబాద్(సిరిసిల్ల): వరుసకు అన్నదమ్ములయ్యే ఇద్దరు యువకుల మధ్య నెలకొన్న భూ వివాదం.. ఒకరి ఆత్మహత్యాయత్నానికి దారితీసింది. పోలీసులు, గ్రామస్తులు చూస్తుండగానే ఓ యువకుడు హైటెన్షన్ విద్యుత్ స్తంభం ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానన్న ఘటన పోలీసులను, గ్రామస్తులను ఉరుకులు, పరుగులు తీయించింది. ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు. మండలంలోని సేవాలాల్‌తండాకు చెందిన ధరంసోత్ రవినాయక్, ధరంసోత్ బాల్‌రెడ్డినాయక్ అన్నదమ్ముల కుమారులు. వీరి మధ్య కొంతకాలంగా భూవివాదం నెలకొంది. భూసమస్య పరిష్కారమయ్యే వరకు వరి పంట కోయొద్దని బాల్‌రెడ్డినాయక్ సోమవారం నిలిపివేయించాడు. దీంతో ఇరు కుటుంబాల మధ్య వాదోపవాదాలు జరిగాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఇరువర్గాలను శాంతింపజేసిన వినలేదు. తనకు అన్యాయం జరిగిందంటూ బాల్‌రెడ్డినాయక్ అక్కడే ఉన్న హైటెన్షన్ విద్యుత్ స్తంభాన్ని ఎక్కాడు. విద్యుత్ తీగలను ముట్టుకుని ఆత్మహత్యకు పాల్పడతానని బెదిరింపులకు పాల్పడ్డాడు. హైటెన్షన్ స్తంభం వెంటనే దిగాలని పోలీసులు, గ్రామస్తులు కోరినా బాల్‌రెడ్డినాయక్ దిగలేదు. దీంతో ఎస్సై వెంకటేశ్వర్లు ఘటన స్థలానికి వెళ్లి బాల్‌రెడ్డి నాయక్‌కు నచ్చచెప్పాడు. భూవివాదం పరిష్కారమయ్యే వరకు దిగబోనని మొండికేయడంతో సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరాను నిలిపివేయించారు. సమస్య పరిష్కారమయ్యేలా చూస్తానని ఎస్సై కౌన్సెలింగ్ చేశారు.



దిగాలని కోరుతున్న కానిస్టేబుల్ ఖాసీం

**దండం పెడుతా దిగు..**

హైటెన్షన్ స్తంభం ఎక్కిన బాల్‌రెడ్డినాయక్‌ను దిగిరావాలని కానిస్టేబుల్ ఖాసీం కోరాడు. చచ్చిపోతే సమస్య పరిష్కారం కాదంటూ.. రెండు చేతులు జోడించి దండం పెడుతున్నా.. దయచేసి దిగు.. అంటూ కోరుతున్న వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. ఖాసీం దండం పెట్టి చెప్పడంతో బాల్‌రెడ్డినాయక్ కొంత తగ్గాడు. ప్రమాదకరమైన స్తంభాన్ని సగం వరకు దిగి అక్కడున్న వారితో చర్చించాడు. ఖాసీం ధైర్యంగా దిగిపో అంటూ అదేపనిగా విజ్ఞప్తి చేయడంతో దిగొచ్చాడు.

## డీప్రమోట్ చేశారని..

- విద్యుత్ టవర్ ఎక్కిన సెక్యూరిటీగార్డు



హైటెన్షన్ విద్యుత్ టవర్‌పై దశరథం

ముస్తాబాద్(సిరిసిల్ల): తనను డీప్రమోట్ చేశారంటూ ఓ సెక్యూరిటీగార్డు హైటెన్షన్ విద్యుత్ టవర్ ఎక్కి నిరసన తెలిపిన ఘటన మండలంలోని నామాపూర్‌లో సోమవారం చోటుచేసుకుంది. తనకంటే జూనియర్లకు ప్రమోషన్ ఇచ్చి తనపై వ్యక్తిగత కక్షతో డిప్రమోట్ చేశారని ఆరోపించాడు. వివరాలు బాధితుడి కథనం ప్రకారం. నామాపూర్‌కు చెందిన ధీకొండ దశరథం (37) గ్రామ శివారులోని ఓ సోలార్‌ప్లాంట్‌లో అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా ఐదేళ్లుగా పని చేస్తున్నాడు. ఇటీవల జూనియర్‌కు పదోన్నతి ఇచ్చి.. తనను డిమోట్ చేశారని ఆరోపించాడు. ఎన్నిసార్లు కంపెనీ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నాడు. చివరికి అక్కడే ఉన్న విద్యుత్ హైటెన్షన్ టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని బెదిరింపులకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కంపెనీ ప్రతినిధులు, పోలీసులు, గ్రామస్తులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. తనకు న్యాయం చేయకుంటే టవర్‌పై నుంచి దూకుతానని దశరథం హెచ్చరించాడు. కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి న్యాయం చేస్తామని కంపెనీ ప్రతినిధులు హామీ ఇవ్వడంతో టవర్ పై నుంచి దిగొచ్చాడు. ఆందోళన విరమించి కిందికి వచ్చిన దశరథం నీరసించి కనిపించడంతో సపర్యాలు చేశారు.

## ఇబ్బందుల్లేకుండా ధాన్యం కొనుగోళ్లు



కొనుగోళ్ల పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

సిరిసిల్ల: రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ కోరారు. కలెక్టరేట్ నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రైతులు పండించిన ప్రతీ గింజను కొనాలన్నారు. అకాల వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ జిల్లాలో 3.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని, 259 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లాలో 6,254 టార్పాలిన్లు 816 తూకపు యంత్రాలు, 620 తేమ కొలిచే సాధనాలు, 622 పాడీ క్లీనర్లు ఉన్నాయని అధికారులు తెలిపారు. 45 లక్షల గన్నీబ్యాగులను కేంద్రాలకు చేర్చాలని పౌరసరఫరాల అధికారులకు సూచించారు. బస్తాకు 40 కిలోల 600 గ్రాములు తూకం వేయాలని తెలిపారు. తూకంలో మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైస్‌మిల్లుల దగ్గర ఇన్‌చార్జీలను నియమించాలన్నారు. 2020–2021, 2021–2022 సీజన్‌ల ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన రూ.8.14 కోట్ల ఏజెన్సీల కమీషన్ చెక్కులను డీసీవో బుద్ధనాయుడు, జెడ్పీ సీఈవో గౌతమ్‌రెడ్డిలకు అందించారు. ధాన్యం కొనుగోళ్ల పోస్టర్‌లను ఆవిష్కరించారు. టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్, ఆర్డీవోలు టి.శ్రీనివాస్‌రావు, పి.పవన్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, జిల్లా వ్యవసాయాధికారి రణధీర్‌రెడ్డి, పౌరసరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి, జిల్లా మేనేజర్ జితేంద్రప్రసాద్, డీటీవో కొండల్‌రావు, మార్కెటింగ్ జిల్లా అధికారి ప్రవీణ్, సిరిసిల్ల తహసీల్దార్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## అవార్డు అందుకున్న గంభీరావుపేట సర్పంచ్



అవార్డు అందుకుంటున్న సర్పంచ్ శ్రీధర్, అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

గంభీరావుపేట(సిరిసిల్ల): ఢిల్లీలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో గంభీరావుపేట సర్పంచ్ కటకం శ్రీధర్‌పంతులు, కార్యదర్శి మజీద్ జాతీయ ఉత్తమ గ్రామ పంచాయతీ పురస్కారం అందుకున్నారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. స్వయం సమృద్ధి, మౌలిక వసతులు కల్గిన గ్రామపంచాయతీల విభాగంలో గంభీరావుపేట దేశంలోనే మూడో స్థానంలో నిలిచింది.


# మొర ఆలకించండి

### ప్రజావాణికి బారులు తీరిన బాధితులు

- అర్జీలు స్వీకరించిన అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్
- ఎండను సైతం లెక్కచేయని బాధితులు
- ప్రజావాణికి 53 దరఖాస్తులు

సిరిసిల్లఅర్బన్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వినతులు వెల్లువెత్తాయి. మండుతున్న ఎండలను సైతం లెక్కచేయకుండా జిల్లా నలుమూలల నుంచి బాధితులు తరలివచ్చారు. సమస్యలు పరిష్కరించాలంటూ అధికారులకు మొరపెట్టుకున్నారు. అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్ అర్జీలు స్వీకరించారు. బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజావాణిలో 53 దరఖాస్తులు వచ్చాయి. రెవెన్యూ 17, మున్సిపల్ 9, డీపీవో 7, ఎస్పీ 6 అర్జీలు వచ్చాయి.


### ఫిజియోథెరపీ వైద్యులను నియమించండి



జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రారంభించిన ఫిజియోథెరపీ సేవలను స్టాఫ్‌నర్సుల ద్వారా కాకుండా ఫిజియోథెరపీ వైద్యులతో అందించాలి. జిల్లాలో చాలా మంది ఫిజియోథెరపీ వైద్యులం అందుబాటులో ఉన్నాం. అనుభవం గల వైద్యులతో చికిత్స చేయడం ద్వారా మెరుగైన సేవలు అందుతాయి. అధికారులు స్పందించి అన్ని పీహెచ్‌సీలలో ఫిజియోథెరపీ వైద్యులకు అవకాశం కల్పించాలి

– స్థానిక ఫిజియోథెరపీ వైద్యులు


### చుక్క నీరు రావడం లేదు



మాది ముస్తాబాద్ మండలం ఆవునూరు. మిషన భగీరథ పథకం ద్వారా మూడేళ్లుగా చుక్క నీరు రావడం లేదు. వేసవిలో నీటికి ఇబ్బందులు పడుతున్నాం. మిషన్ భగీరథ పైప్ లైన్ కోసం తీసిన గుంతలు ఇప్పటికీ పూడ్చలేదు. వాహనదారులు అవస్థలు పడుతున్నారు. సమ స్య పరిష్కరించాలని చాలా సార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోవడం లేదు. వేసవిని దృష్టిలో పెట్టుకొని నీరు అందించాలి.

– క్రాంతికుమార్, బీజేపీ నాయకుడు

### కల్వర్టును కాపాడండి



ముష్టిపల్లి చెరువు నుంచి అలుగు దూకినప్పుడు చంద్రంపేట చెరువులోకి నీరు వెళ్లేందుకు రెండో బైపాస్‌రోడ్డులో కల్వర్టులు నిర్మించారు. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు నీరు వెళ్లకుండా కల్వర్టు ఉన్న స్థలాన్ని కబ్జా చేసి మట్టిపోశారు. దీంతో భారీ వర్షాలు పడ్డప్పుడు ముష్టిపల్లి, రాజీవ్‌నగర్ ప్రాంతాలు నీటమునిగే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి కల్వర్టు కింద మట్టిని తొలగించి నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలి.

– బొల్గం నాగరాజ్‌గౌడ్, సిరిసిల్ల కౌన్సిలర్

### భూములు మునిగిపోయాయి



మాది ఇల్లంతకుంట మండలం సిరికొండ. మా ఊరిలోని పెద్దచెరువులో సాగు చేసుకుంటున్న దాదాపు 200 మంది కుటుంబాల పట్టా భూములు నీట మునిగాయి. సమస్య పరిష్కరించాలని మూడేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్న పట్టించుకోవడం లేదు. ఉన్న భూములను సాగుచేసుకోలేక అప్పుల పాలవుతున్నాం. పది రోజుల్లో మా సమస్యను పరిష్కరించకపోతే ప్రాణత్యాగానికి సైతం వెనుకాడం.

– సిరికొండ బాధిత రైతులు

### ఆస్తి రాసుకొని వెళ్లగొట్టాడు



మాది ఇల్లంతకుంట మండలం అనంతారం. నాకు ముగ్గురు కొడుకులు. భర్త ముప్పై ఏళ్ల క్రితం మరణించాడు. నా రెండో కొడుకు నా బాగోగులు చూసుకుంటా అని చెప్పి నా భర్త ద్వారా వచ్చిన ఎకరంన్నర భూమిని తన పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఐదు నెలల క్రితం ఇంట్లో నుంచి వెళ్లగొట్టిండు. ఇల్లు లేదు, పొలం లేదు అని హింసిస్తున్నాడు. దయచేసి నా భూమిని ఇప్పించి న్యాయం చేయండి.

– పోచవ్వ, అనంతారం

## సాంచాలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి



సిరిసిల్లటౌన్: పవర్‌లూమ్స్‌కు వెయ్యి యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇవ్వాలని సిరిసిల్ల ఆసాముల సమన్వయ కమిటీ డిమాండ్ చేసింది. సోమవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. బీవైనగర్‌లోని చేనేత జౌళిశాఖ కార్యాలయం సమీపంలో ధర్నా చేపట్టారు. పలువురు ఆసాములు మాట్లాడుతూ ఏళ్లుగా తమ సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. పింజర్‌లు, జూకార్డు, డాబీకి సంబంధించి రూ.15వేల చొప్పున సబ్సిడీ అందించాలని, ప్రతి మ్యాక్స్ సంఘ సభ్యుడికి 1/3 కూలీ అమలు చేయాలని కోరారు. సిరిసిల్లలో యారన్ డిపో ఏర్పాటు చేయాలని కోరారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. అధ్యక్షుడు రవీందర్, ప్రధాన కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.

## ఆస్పత్రుల్లో నిబంధనలు పాటించాలి



రుద్రంగి ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీరాములు

సిరిసిల్ల: ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌ల్లో నిబంధనలు పాటించాలని జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీరాములు సూచించారు. రుద్రంగిలోని మహాలక్ష్మీ ఆస్పత్రి, చందుర్తి మండలం మల్యాలలో ల్యాబ్‌ను, వేములవాడలోని ల్యాబ్‌లను సోమవారం తనిఖీ చేశారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అనుమతి లేకుండా ఆస్పత్రి, ల్యాబ్‌లను ఏర్పాటు చేయరాదన్నారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రికార్డులను పరిశీలించారు. డీఈఎంవో సంతోష్, హెచ్ఈవో బాలయ్య, వైద్య సిబ్బంది జలపతి, యాదగిరి పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### కణతి తొలగింపు



కణతిని చూపుతున్న వైద్యురాలు

ముస్తాబాద్ (సిరిసిల్ల): ఓ మహిళ కడుపులోంచి పదికిలోల కణతిని సోమవారం వైద్యులు తొలగించారు. డాక్టర్ చింతోజు శంకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా దుబ్బాకు చెందిన ఓ మహిళ కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. దీంతో ముస్తాబాద్ పీపుల్స్ ఆస్పత్రిలో చేరగా వైద్యులు పరీక్షించారు. డాక్టర్ తేజస్వి నేతృత్వంలోని వైద్యబృందం మహిళ కడుపులో ఉన్న కణతిని శస్త్రచికిత్స చేసి తొలగించారు. వైద్యబృందానికి మహిళ బంధువులు ధన్యావాదాలు తెలిపారు.

### కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్: పల్లెపల్లెకు..ఇంటింటికీ సీపీఐ కరపత్రాలను పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటి వేణు ఆవిష్కరించారు. సోమవారం సిరిసిల్లలోని కార్మిక భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలపై పార్టీ చేపడుతున్న ప్రజాచైతన్య యాత్రలో భాగంగా ఈనెల 21న పద్మనాయక కల్యాణ మండపంలో భారీసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్, విప్లవ చిత్రాల నటుడు ఆర్. నారాయణమూర్తితో పాటు సీపీఐ, కాంగ్రెస్ పార్టీల పెద్దలు హాజరవుతారన్నారు. నాయకులు పంతం రవి, రాములు, నాగరాజు, మంచికట్ల లక్ష్మణ్ పాల్గొన్నారు.

### ప్రజావాణిలో ఫొటోలు తీయొద్దు

సిరిసిల్లఅర్బన్: ప్రజావాణి కార్యక్రమంలో ఫొటోలు తీయొద్దంటూ అక్కడే పనిచేస్తున్న సిబ్బందిలో ఒకరు విలేకరులతో దురుసుగా ప్రవర్తించారు. సోమవారం కలెక్టరేట్‌లో కొనసాగిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు బారులుతీరారు. కొందరు బాధితులు తమ సమస్యలను విలేకరుల వద్ద మొరపెట్టుకుంటుండగా.. అక్కడే విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ఒకరు వచ్చి ఇక్కడ ఫొటోలో తీయొద్దని.. బయటకు వెళ్లి తీసుకోండంటూ మాట్లాడారు. ఎందుకు తీయొద్దని ప్రశ్నించగా.. మా సూపరింటెండెంట్ వద్దన్నారని తెలిపారు. వెళ్లిపోండంటూ ఇష్టానుసారంగా వ్యవహరించారు. ఇదంతా గమనిస్తున్న ఓ అధికారి చూసీచూడనట్టుగా వ్యవహరించడం గమనార్హం.

### ట్రాక్టర్ డ్రైవర్ మృతిపై సీఐ విచారణ

కథలాపూర్ (వేములవాడ): మండలంలోని తక్కళ్లపెల్లి శివారులో ఈనెల 9న ట్రాక్టర్ డ్రైవర్ బొడ్డుసాగర్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందగా కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్ సోమవారం విచారణ చేపట్టారు. వరదకాలువ పక్కన రాళ్ల మధ్యలో సాగర్ మృతదేహం పడి ఉందని, శరీరం, తలపై తీవ్రగాయాలున్నట్లు గ్రామస్తులు సీఐకి వివరించారు. అనంతరం సీఐతో బీఎస్పీ నాయకులు సీఐతో మాట్లాడుతూ.. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ బీఎస్పీ మండలాధ్యక్షుడు తెడ్డు శేఖర్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బాలె నీలకంఠం, కలిగోట రాజన్న, పాలెపు సంజీవ్, చాకలి వెంకటేశ్, పాడేటి అర్జున్, గణేశ్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

# అంతటా అగ్గిపెట్టుడే..

- చెత్తను ఎత్తడం మర్చిన కార్మికులు
- ఇళ్లలోకి వ్యాపిస్తున్న పొగ
- పెరుగుతున్న వాయుకాలుష్యం

వేములవాడ : పట్టణంలో వాయు కాలుష్యం పెరుగుతోంది. మున్సిపల్‌లో పనిచేస్తున్న కార్మికులు రోడ్లను శుభ్రం చేసే క్రమంలో పేరుకుపోయిన చెత్తను సేకరించి బయటి ప్రాంతాలకు తరలించకుండా అక్కడే నిప్పుపెట్టి తగులబెడుతున్నారు. దీంతో కాలనీల్లో వాయుకాలుష్యం పెరుగుతోంది. అసలే వేసవికావడంతో కూలర్లు నడుస్తున్న సమయంలో కాలనీల్లోని పొగంతా ఇళ్లలోకి చేరుకుంటుందని ప్రజలు వాపోతున్నారు. అధికారులు, కార్మికులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్నది పట్టణంలోని త్రినేత్ర ఫంక్షన్‌హాల్ ప్రాంతం. శుక్రవారం వేకువ జామున విధులకు వచ్చిన కార్మికురాలు చెత్తను పోగుచేసి ఇలా నిప్పుపెట్టింది. ఇదేంటని ప్రశ్నిస్తున్న కాలనీవాసులపై ఎదురు మాట్లాడుతోందని జనం వాపోతున్నారు. అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోకుంటే వాయుకాలుష్యం పెరగడమే కాకుండా అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు భయపడుతున్నారు.

### మార్నింగ్ వాక్‌కు కష్టంగా ఉంది



కార్మికులు చెత్తకు నిప్పు పెట్టడంతో పొగవ్యాపించి మార్నింగ్ వాకింగ్‌కు ఇబ్బంది పడుతున్నాం. అధికారులు, సిబ్బందికి తెలిపినా చర్యలు తీసుకోవడం లేదు. ఇంకా నిత్యం రోడ్లపై చెత్తను తగులబెడుతూనే ఉన్నారు.

– గోన్కుల రవి, వాకర్స్ క్లబ్ ప్రతినిధి

### వాయుకాలుష్యం పెరుగుతోంది



వేములవాడలోని మండల పరిషత్ ప్రాంతంలో మున్సిపల్ సిబ్బంది రోడ్లపైనే చెత్తను తగులబెడుతుండటంతో వాయుకాలుష్యం విపరీతంగా పెరుగుతోంది. అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోకుంటే అనారోగ్యం బారినపడే ప్రమాదం ఉంది.

– రేగుల రాము, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు

### చర్యలు తీసుకుంటాం



రోడ్లను ఊడ్చే క్రమంలో సేకరించే చెత్తను వాహనాల్లో దూర ప్రాంతాలకు, డంప్‌యార్డుకు పంపించాలి. ఇలా చేయకుండా రోడ్లపైనే చెత్తను తగులబెట్టడం చట్టరీత్యా నేరంలాంటిదే. రోడ్లపై చెత్తను తగులబెడుతున్న కార్మికులపై చర్యలు తీసుకుంటాం.

– అన్వేష్, మున్సిపల్ కమిషనర్.

## ముంపు గ్రామాల సమస్యలు పరిష్కరించాలి



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఐక్య వేదిక సభ్యులు

సిరిసిల్ల అర్బన్: మిడ్‌మానేరు జలాశయంలో ముంపుకు గురైన 12 గ్రామాల సమస్యలు పరిష్కరించాలంటూ మధ్యమానేరు ముంపుగ్రామాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమవారం అడిషనల్ కలెక్టర్‌కు ఖీమ్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీమేరకు ప్రతి కుటుంబానికి రూ.5.04 లక్షలు చెల్లించాలన్నారు. పరిశ్రమలు ఏర్పాటు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 30లోపు మంత్రి కేటీఆర్ సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చూడాలన్నారు. లేకపోతే ఐక్యవేదిక ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరవధిక నిరాహార దీక్ష చేపడుతామని హెచ్చరించారు. బీజేపీ నాయకులు ఎర్రం మహేశ్, వెంకటేశ్వర్ రావు, ముంపు గ్రామాల ఐక్య వేదిక నాయకులు పిల్లి కనుకయ్య, కూస రవీందర్, రాజుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఫారెస్ట్ ఆఫీస్‌కు కలప తరలింపు



ఫారెస్టు అధికారులు స్వాధీనం చేసుకున్న టేకు కలప

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలం ఎన్గల్ శివారులో ఈనెల 5న పోలీసులు పట్టుకున్న కలపను ఎట్టకేలకు సోమవారం అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. పది రోజులుగా పోలీస్‌స్టేషన్‌లోనే ఉన్న కలప గురించి బీట్, సెక్షన్ అధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్గల్‌కు చెందిన కలప వ్యాపారులతో అటవీశాఖ సిబ్బందికి సంబంధాలు ఉన్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో కలప స్మగ్లర్లతో టేకు కలపను తెప్పించి వ్యాపారం చేసేందుకు పంట చేనులను అడ్డాగా చేసుకున్నట్లు గ్రామంలో చర్చ సాగుతోంది.

**పొంతన లేని సమాధానాలు**

పట్టుకున్న కలపను నిబంధనల ప్రకారం పోలీసులు అటవీశాఖ అధికారులకు అప్పగించాలి. కానీ కలప పట్టుకున్న కథనం 'సాక్షి'లో ప్రచురితమైయ్యే వరకు అటవీశాఖ అధికారులకు తెలియకపోవడం గమనార్హం. ఈ విషయాన్ని తెలుసుకునేందుకు అటవీశాఖకు చెందిన చందుర్తి పరిధిలోని సిబ్బందికి ఫోన్ చేస్తే విషయం తెలిసినప్పటికీ తీరిక లేక పట్టుకున్న కలపను స్వాధీనం చేసుకోలేకపోయామని తెలిపారు. స్వాధీనం చేసుకున్న కలప విలువ ఎంత ఉంటుందని వేములవాడ ఎఫ్ఆర్వో ఖలీలొద్దీన్‌ను ఫోన్‌లో వివరణ కోరగా.. బీట్ అధికారులు ఇంటికెళ్లిపోయారని చెప్పారు.

## జిల్లా వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల అర్బన్ : మానసిక సమస్యతో బాధపడే వారు జిల్లాస్థాయిలో కౌన్సెలింగ్ ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. సోమవారం రాత్రి కలెక్టరేట్‌లో జిల్లా వైద్యాధికారులు, సైకాలజిస్టులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాధితులకు ధైర్యం కల్పించేందుకు సైకాలజిస్టులు, కౌన్సిలర్లు ఫోన్‌లో అందుబాటులో ఉంటారన్నారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్ రావు, డాక్టర్ మహేశ్, సైకాలజిస్టులు పున్నంచందర్, డా. నయిమా, డా సతీశ్, కౌన్సిలర్లు శ్రీకాంత్, రేణుక, గంగయ్య, దయాకర్, తదితరులున్నారు.

## బడులను బలోపేతం చేయాలి

- జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్



డీఈవోను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రభుత్వ బడులను బలోపేతం చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన బోధన చేయాలని జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ కోరారు. మండలంలోని రాచర్లతిమ్మాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల పనులను సోమవారం పరిశీలించారు. జిల్లా విద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారి స్కూల్‌కు వచ్చిన రమేశ్‌కుమార్‌ను ఉపాధ్యాయులు సన్మానించారు. వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులతో విద్యా బోధనచేయాలని సూచించారు.

## ఘనంగా బీరప్ప కామరాతి కల్యాణం



కల్యాణ వేడుకల్లో యాదవులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలో యాదవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం బీరప్పకామరాతి కల్యాణ వేడుకలను వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించారు. బీరప్ప కళాకారుల నృత్యాలు, గాండ్రింపులు ఆకర్షణగా నిలిచాయి. టీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎంపీపీ పిల్లి రేణుక, జెడ్పీటీసీ చీటి లక్ష్మణరావు, సర్పంచ్ కదిరి రజిత, యాదవ కుల సంఘం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

### గుండెపోటుతో మహిళ మృతి



గుండం రాజ్యలక్ష్మి (ఫైల్)

కోనరావుపేట : మండలంలోని మర్రిమడ్ల గ్రామానికి చెందిన ఓ మహిళ గుండెపోటుతో మృతిచెందింది. గ్రామానికి చెందిన గుండం రాజ్యలక్ష్మి (44) రెండ్రోజులగా వ్యవసాయ పనులకు వెళ్లింది. సోమవారం ఉదయం ఇంట్లోనే గుండెపోటుతో మృతిచెందింది. భర్త లక్ష్మీరాజం కూలీపనులు చేస్తుంటాడు. వీరికి ఇద్దరు కూతుళ్లు శివరాణి, శివాని ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు జింక శ్రీనివాస్ కోరారు.

## రామగుండం ప్రజలు తెలంగాణ వారు కాదా..!

- ఇక్కడి నిధులు గజ్వేల్‌కు ఎత్తుకుపోతున్నారు
- 'బీపీఎల్' భూముల్లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మించాలి
- బూడిద, ఇసుక, ఉద్యోగాల దోపిడీ రాజ్యం నడుస్తోంది
- ఓపెన్‌కాస్టులకు వ్యతిరేకమంటూనే నగరం నడిబొడ్డున ఏర్పాటా..?
- పీపుల్స్ మార్చ్‌లో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



పాదయాత్రలో భట్టి విక్రమార్క, డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్, అడ్లూరి, తదితరులు

సాక్షి, పెద్దపల్లి: బొగ్గు ఖనిజ సంపద ఉన్న రామగుండం ప్రజలు తెలంగాణ వారు కాదా..? ఇక్కడ ఖర్చు చేయాల్సిన డీఎంఎఫ్‌టీ, సీఎస్సార్ నిధులు గజ్వేల్, సిద్దిపేట, సిరిసిల్లకు ఎత్తుకెళ్లే హక్కు ఎవరిచ్చారని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పీపుల్స్‌మార్చ్‌లో భాగంగా రామగుండం నియోజకవర్గంలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి పాదయాత్ర చేపట్టారు. ముర్మూర్, గొల్లపల్లి, బ్రహ్మణపల్లి, ఆకేనపల్లి, తక్కెలపల్లి శివారు, పుట్నూర్, జయరాం, రచ్చపల్లి గ్రామాల్లో స్థానికులను కలుస్తూ.. వారి సమస్యలను వింటూ.. వారికి భరోసా కల్పిస్తూ ముందుకుసాగారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన రచ్చబండ కార్యక్రమంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం వస్తే ఓపెన్‌కాస్ట్ మైనింగ్ ఉండవని ప్రకటించిన కేసీఆర్.. రామగుండం నగరం నడిబొడ్డున ఓపెన్‌కాస్ట్ తెరిచి చిన్నపాటి భూకంపాలకు కారణమయ్యారని మండిపడ్డారు. వాటిని రద్దు చేయించాలన్న సోయి స్థానిక ఎమ్మెల్యేకు లేకపోవడం విచారకరమన్నారు. ఎల్లంపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పూర్తి చేయకుండా తొమ్మిదిన్నరేళ్లుగా ఈ ప్రభుత్వం గాడిదలను కాస్తోందా..? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తిచేసి అంతర్గాం, పాలకుర్తి ప్రాంతాలకు నీళ్లు ఇస్తామన్నారు. బీపీఎల్ కంపెనీ ఏర్పాటుకు 1200 ఎకరాలు భూసేకరణ చేసి రెండు దశాబ్దాలు అవుతున్నా.. ఇప్పటివరకు కంపెనీ ఏర్పాటు చేయకుండా ఏం చేస్తున్నారని విమర్శించారు. కంపెనీ ఏర్పాటు చేయకుంటే సేకరించిన భూములను రైతులకైనా ఇవ్వాలని, లేకుంటే రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కోసమైనా కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇసుక, బూడిద దందా చేసుకునేందుకు ప్రజలు ఎమ్మెల్యేలుగా గెలిపించలేదన్నారు. ఆర్ఎఫ్‌సీఎల్ కాంట్రాక్టు లేబర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని ఎమ్మెల్యే డబ్బులు వసూలు చేయడం సిగ్గు చేటు అని పేర్కొన్నారు. ఉద్యోగాలు రాక.. వసూలు చేసిన డబ్బులు తిరిగి బాధితులకు ఇవ్వకపోవడంతో బాధితుల ఆత్మహత్యలకు కారణమైన ఎమ్మెల్యే ఈ రామగుండానికి అవసరమా..? అని ప్రశ్నించారు. ఇక్కడున్న ఎమ్మెల్యే దోచుకుని దాచుకోవడమే తప్ప ప్రజలకు చేసిందేమీలేదని, ఇక్కడి నదిజలాలను హైదరాబాద్‌కు తరలిస్తున్నా ఇక్కడి ప్రజల తరపున ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. తలాపునే గోదావరి పారుతున్నా ఇక్కడి రైతులకు సాగునీరు.. ప్రజలు తాగడానికి చుక్కనీరు అందించని చరిత్ర బీఆర్ఎస్ పార్టీదేనని విమర్శించారు.

**బీపీఎల్ భూములు తిరిగి ఇవ్వాలి**

డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ మాట్లాడుతూ.. సాగు చేసుకుని జీవనం పొందే అన్నదాతలు తమ భూములను త్యాగం చేస్తే నేడు వారికి మిగిలింది శూన్యమేనని, కనీసం వారికి అందే పరిహారం కోసం కాళ్లరిగేలా తొమ్మిదేళ్లుగా తిరుగుతున్నా ఇచ్చిన పాపన పోవడంలేదన్నారు. సూపర్ క్రిటికల్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటుపై పాలకులకు సోయిలేదన్నారు. సేకరించిన బీపీఎల్ భూములను రైతులకు తిరిగి ఇవ్వాలన్నారు. నిరుపేదలు వేలాదిగా ఇళ్లు లేక కిరాయి ఇళ్లల్లో నివాసం ఉంటుంటే డబుల్ బెడ్ రూమ్ పేరుతో ఏదో నామమాత్రంగా వారి కార్యకర్తలకే కేటాయించారని విమర్శించారు.

## దిగుబడిపై దిగులు

- జిల్లా వ్యాప్తంగా మొదలైన వరి కోతలు
- 3.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా
- తెగుళ్ల బెడదతో సగానికి పైగా తగ్గనున్న దిగుబడి
- ఆందోళన చెందుతున్న రైతులు



"ఈ ఫొటోలో ఉన్న రైతు పేరు పోతురాజు తిరుపతి, చందుర్తి గ్రామం. ఇతనికి ఉన్న ఆరెకరాల్లో వరిని సాగుచేశాడు. ఏటా యాసంగి 430 సంచుల ధాన్యాన్ని విక్రయించేవారు. ఈ ఏడాది పంటకు మూడుసార్లు క్రిమి సంహారక మందులు పిచికారీ చేశారు. దిగుబడిపై తెగుళ్లు తీవ్ర ప్రభావం చూపడంతో 270 సంచుల దిగుబడి మాత్రమే వచ్చిందని వాపోయారు."



వరిపంటను కోస్తున్న హార్వెస్టర్

చందుర్తి (వేములవాడ): జిల్లా వ్యాప్తంగా 35 వేల ఎకరాల్లో రైతులు వరి సాగుచేశారు. వానాకాలంలో 1.37 లక్షల ఎకరాల్లో సాగుచేయగా భారీ వర్షాలతో పంటలకు చీడపీడలు ఆశించి దిగుబడి తగ్గింది. ఎకరాకు 25 క్వింటాళ్ల నుంచి 28 క్వింటాళ్ల వరకు దిగుబడి రానుండగా 16 క్వింటాళ్ల నుంచి 22 క్వింటాళ్ల వరకే వచ్చింది. యాసంగిలో 1.72 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారని వ్యవసాయాధికారుల అంచనా. ఎకరాకు 27 క్వింటాళ్ల నుంచి 35 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చేది. వివిధ రకాల తెగుళ్లు సోకడంతో రైతులు నివారణ కోసం విచ్చలవిడిగా పురుగుమందులను పిచికారీ చేశారు. పొట్టదశ నుంచి పంటకు మొగి పురుగు, మెడ విరుపు, తెగుళ్లతో పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపగా ఎకరాకు 18 క్వింటాళ్ల నుంచి 22 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని రైతులు అంచనా వేస్తున్నారు.

**వరికోత యంత్రాలకు పెరిగిన రేట్లు**

అసలే దిగుబడి తగ్గి ఆందోళన చెందుతున్న రైతులను వరికోత యంత్రాలకు గంటకు ధర రూ.1800 నుంచి రూ.2200 వరకు పెంచారు. దిగుబడి రాక నష్టాల్లో ఉన్న అన్నదాతకు పెంచిన యంత్రాల ధరలు భారంగా మారుతున్నాయని ఆందోళన చెందుతున్నారు.

**259 కొనుగోలు కేంద్రాలు**

జిల్లాలో 259 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు జిల్లా అధికారులు ఏర్పాట్లు చేశారు. 1.72 లక్షల ఎకరాల్లో పంట సాగుచేయగా 3.40లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేశారు. జిల్లా వ్యాప్తంగా దిగుబడి మాత్రం 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం చేతికి వస్తుందని రైతులు భావిస్తున్నారు.

**కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి**

జిల్లా వ్యాప్తంగా వరికోతలు ప్రారంభమయ్యాయి. ధాన్యాన్ని ఆరబోసేందుకు స్థలాలు లేకపోవడంతో రోడ్లపైనే ధాన్యం పోస్తున్నారు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని పోలీసులు ఓ వైపు ప్రచారం చేస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లాల్లో మూడు నాలుగు కేంద్రాల కంటే మిగతా చోట్ల ప్రారంభించకపోడంతో ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలులో జాప్యం జరిగితే వర్షాలతో ధాన్యం తడిసి నష్టపోతామని రైతులు వాపోతున్నారు. గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.





### బాగా చదవాలి బేటా

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల) : చిన్నతనం నుంచే లక్ష్యంతో చదివితే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని మంత్రి కేటీఆర్ విద్యార్థులకు సూచించారు. మండంలోని రాజన్నపేట పాఠశాలలో అదనపు తరగతి గదుల ప్రారంభోత్సవం సందర్భంగా కాసేపు విద్యార్థులతో గడిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు పుష్పగుచ్ఛంతో మంత్రికి స్వాగతం పలికారు. తరగతి గదులను పరిశీలించిన మంత్రి విద్యార్థులకు పలు ప్రశ్నలు వేశారు. ఎండలో నిలబడొద్దంటూ సూచించారు. చిన్నారులతో కరచాలనం చేసి సెల్ఫీలు దిగారు.

### ప్రైవేట్‌కు అమ్మినా.. పడిగాపులే..



ముస్తాబాద్ : యాసంగి ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు ఇంకా పూర్తి స్థాయిలో తెరుచుకోలేదు. దీంతో ధాన్యాన్ని రైతులు మిల్లర్లకు అమ్ముకుంటున్నారు. ముస్తాబాద్‌లోని ఓ రైస్‌మిల్లు వద్ద ట్రాక్టర్లలో తీసుకువచ్చిన ధాన్యం అమ్ముకునేందుకు రైతులు ఇలా పడిగాపులు కాస్తున్నారు. క్వింటాల్ ధాన్యానికి రూ.1710కే అమ్ముతున్నామని, రెండ్రోజులుగా నిరీక్షిస్తున్నట్లు తెలిపారు.